రైతుల పక్షపాతి సీఎం జగన్

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- కొడాలిలో పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభం
- రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచన


కొడాలిలో పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఘంటసాల(అవనిగడ్డ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తూ వారి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఘంటసాల మండలం కొడాలిలో నియోజకవర్గ స్థాయి పసుపు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొడాలిలోని ఘంటసాల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పసుపు కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ పసుపునకు రూ. 6,850 ఇస్తుందని చెప్పారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మార్క్‌ఫెడ్ డీఎం బి. మురళీ కిశోర్ మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం ఘంటసాల మండలంలో 25 ఎకరాలు, చల్లపల్లిలో 223, మోపిదేవిలో 218, అవనిగడ్డలో 16, నాగాయలంకలో 1.55 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగుచేశారని చెప్పారు. ప్రతి రైతు నుంచి గరిష్టంగా 30 క్వింటాళ్లను కొనుగోలు చేస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఈ క్రాప్ చేయించి శాంపిల్స్ తీసుకువస్తే నిబంధనలు అనుసరించి పసుపును కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈనెల 30వ తేదీ వరకు కొనుగోళ్లు జరుగుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, ఏపీ వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్‌పర్సన్ జె. రాఘవరావు, కొడాలి, కొత్తపల్లి, ఘంటసాల పీఏసీఎస్ చైర్‌పర్సన్లు తాతినేని వెంకట కృష్ణారావు, పరుచూరి రామకృష్ణ, వేమూరి రత్నశేఖర్, వ్యవసాయ సలహా మండలి నియోజకవర్గ సభ్యులు గోగినేని పెరుమాళ్లు, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధినేని రాంప్రసాద్, పడమట వీరకుమార్, ఆకురాతి భాస్కరరావు, ఏఓ కె. మురళీకృష్ణ, వీఏఓలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన పెడన కమిషనర్ మహేంద్ర



పెడన: పెడన మున్సిపల్ నూతన కమిషనర్ బంటుమిల్లి మహేంద్ర బుధవారం జిల్లా కలెక్టర్ రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజాబాబుకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి మున్సిపల్ కార్యాలయం నుంచే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని చెప్పారు.

స్వామి వారి సన్నిధిలో ఐఏఎస్ అధికారి



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పీఆర్‌ఐ అదనపు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి బాలాజీ దిగంబర్ మంజులే బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు ఫణి కుమార్ శర్మ, మణిదీప్ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామి వారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందజేశారు.

అందుబాటులో వరి విత్తనాలు

రామవరప్పాడు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో వరి విత్తనాలు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రంగనాథ్ బాబు బుధవారం తెలిపారు. వరి విత్తనాలు (ఎంటీయూ 1061, బీపీటీ 5204) రకాలను రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై ఇస్తున్నారని, కావాల్సిన రైతులు తీసుకెళ్లవలసిందిగా సూచించారు.

మజ్జిగ పంపిణీ



నాగాయలంక: దేవనబోయిన రామారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రమేష్, ఆరేవ రపు మురళీకృష్ణ ఆర్థిక సౌజన్యంతో బుధవారం 200 లీటర్ల మజ్జిగను బాటసారులకు పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు ఎస్.కృష్ణప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాగాయలంక ప్రధాన కూడలి బస్‌స్టాప్‌లో జరిగిన కార్యక్రమంలో బాసు లంకబాబు, జి.రవిబాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఉత్తరపాలెం(మోపిదేవి): ఉత్తరపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో దోనే స్వరూపరాణి పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. అవనిగడ్డకు చెందిన శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు రూ. 6 వేలు, స్థానిక నాయకుడు యాకోబు రూ. 3 వేలను బాధితురాలికి బుధవారం అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ మండల శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తహసీల్దార్ కె. నవీన్ కుమార్ చేతుల మీదుగా వంటపాత్రలు, హైజనిక్ కిట్లు, నిత్యావసర సరుకులు, బియ్యం, వి. వెంకటేశ్వరరావు రూ. 5 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు.

ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నజరానా


బాధ్యతలు స్వీకరిస్తున్న దిల్‌షాద్ నజరానా

చల్లపల్లి: రాష్ట్ర ఉర్దూ అకాడమీ పాలక మండలి సభ్యురాలిగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు షేక్ దిల్‌షాద్ నజరానా పదవీ బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని ఉర్దూ అకాడమీ చాంబర్‌లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. నజరానా మాట్లాడుతూ తన సేవలకు గుర్తింపుగా పదవి లభించిందని చెప్పారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మంచి సేవలు అందిస్తానన్నారు. నజరానాను నదీమ్ అహ్మద్, చల్లపల్లి జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, నాయకులు అబ్దుల్ కరీం, పఠాన్ కరిముల్లా ఖాన్ సన్మానించారు.

12 నుంచి గ్రామీణ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని పాత రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పట్టాభి ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని సంస్థ డైరెక్టర్ ఎం. విజయభారతి తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉన్న జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు 30 రోజుల పాటు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇస్తామని చెప్పారు. అనంతరం యూనియన్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు వాట్సాప్, ఫోన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. నెలరోజుల పాటు హాస్టల్, భోజన వసతి, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర సదుపాయాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 63019 05759, 80089 96818 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

రూ.3.44 లక్షల జరిమానా


మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

అవనిగడ్డ: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు చేశారు. మొత్తం 32 బృందాలు 2,319 గృహ సర్వీసులు, 125 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 131 సర్వీసులకు అధికలోడు 172 కేడబ్ల్యూ మొత్తానికి రూ.3,44,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ విజిలెన్స్ డీఈఈ ఎస్. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే సెల్: 94408 12362, 94408 12363 నెంబర్లకు సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో చల్లపల్లి డీఈఈ పి. శివనాగేశ్వరరావు, అవనిగడ్డ ఏఈ ఎం. వెంకటేశ్వరరావు, ఉయ్యూరు డివిజన్ ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

త్వరలో వలంటీర్లకు పురస్కారాల ప్రదానం


పెడన 11వ వార్డులో తెల్లవారు జామునే పింఛన్ అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

పెడన: సిఫార్సులు లేవు...రాజకీయాలు అసలే లేవు. కేవలం పనితీరు ఆధారంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్ల సేవలను గుర్తించి పురస్కారాలు అందజేస్తోంది. ఈ ఏడాది కూడా పెడన నియోజకవర్గంలో పనిచేస్తున్న వలంటీర్లలో ఐదుగురికి సేవా వజ్ర కింద ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున అందజేయనున్నారు. నియోజకవర్గంలోని మండలానికి ఐదుగురు, పట్టణానికి ఐదుగురు చొప్పున మొత్తం 25 మందిని సేవారత్నకు ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున అందజేయనున్నారు. నియోజకవర్గంలోని మిగిలిన 1,018 మంది వలంటీర్లను సేవా మిత్రలుగా గుర్తించి ఒక్కో వలంటీరుకు రూ.10 వేల చొప్పున ఇవ్వనున్నారు. వీరందరినీ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ త్వరలో అభినందించి సత్కరించి సేవా పురస్కారాలను అందజేస్తారు.

మండలాల వారీగా పరిశీలిస్తే...

పెడన పట్టణంలో సేవా వజ్ర 1, సేవా రత్న 5, సేవామిత్ర 168 అందనున్నాయి. పెడన మండలంలో సేవా వజ్ర 2, సేవా రత్న 5, సేవా మిత్ర 193, బంటుమిల్లి మండలంలో సేవా రత్న 5, సేవా మిత్ర 186, కృత్తివెన్ను మండలంలో సేవా వజ్ర ఒకటి, సేవా రత్న 5, సేవా మిత్ర 243, గూడూరు మండలంలో సేవా వజ్ర ఒకటి, సేవా రత్న 5, సేవా మిత్ర 228 మంది పురస్కారాలు అందుకోనున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ఈడేపల్లి, చిలకలపూడి శాఖ గ్రంథాలయాల్లో తరగతులు నిర్వహించారు. ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో డ్రాయింగ్ మాస్టర్ శేషగిరిరావు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. క్రాఫ్ట్ టీచర్ వనజ విద్యార్థులతో పేపర్ బొకేలను తయారు చేయించారు. ఉపాధ్యాయిని నాగమణి మురళీ కోలాటం నేర్పించారు. మ్యూజికల్ చైర్ ఆటలను ఆడించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శిబిరం ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ నిర్వాహకురాలు వెంకటేశ్వరమ్మ తెలిపారు. చిలకలపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో స్కిప్పింగ్ ఆటలు ఆడించారు.

మెకానిక్ కుమార్తెకు నగదు ప్రోత్సాహం


సహాయం అందిస్తున్న ధర్మ, ఆసీఫ్ అలీ

చల్లపల్లి: టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్ కుమార్తెకు నగదు ప్రోత్సాహం అందించారు. ఘంటసాలకు చెందిన మెకానిక్ మస్తాన్ కుమార్తె షేక్ జాస్మిన్ ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతూ 575 మార్కులతో ఘంటసాల మండల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఆమెను చల్లపల్లిలో అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధర్మ రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆసీఫ్ అలీ, చల్లపల్లి అసోసియేషన్ నాయకులు కొల్లూరి ప్రేమ్‌చంద్, ఉస్మాన్ షరీఫ్, హఫీస్, సురేష్, షరీఫ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా 'ఫ్యామిలీ డాక్టర్'


జమీదగ్గుమిల్లిలో వైద్య సేవలు అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యుడు వంశీకృష్ణ

జమీదగ్గుమిల్లి(పామర్రు): ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ)ని అత్యంత పకడ్బందీగా అమలు చేస్తూ ప్రజలకు ఉన్నతమైన వైద్యసేవలను అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వేదాంతం వంశీ కృష్ణ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని జమీదగ్గుమిల్లి గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన శైలి జబ్బుల బాధితులను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెడతామని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ ఫలానా గ్రామానికి ఫలానా రోజు వస్తారనే వివరాలను ముందుగానే వెల్లడిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో గ్రామానికి డాక్టర్లు వస్తున్నట్లు ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రజలందరికీ తెలియజేస్తామన్నారు. డాక్టర్ వద్దకు వచ్చి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఎఫ్‌పీసీని మెరుగ్గా ముందుకు తీసుకెళ్లేలా సమర్థులైన అధికారులు సేవలను వినియోగించుకోవాలని కోరారు. గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించడం ద్వారా రక్త హీనత సమస్యను ఎదుర్కొనే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గ్రామ సర్పంచ్ కె. చంద్రశేఖర్‌రావు, సీహెచ్‌ఓ బి. ఉదయ్ కిరణ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం ఆదాంబీ, 104 వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

13 నుంచి స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు

కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెంలోని గంగా బాల త్రిపుర సుందరీ సమేత మల్లికార్జున స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. 13న ఉదయం 7 గంటలకు గోపూజ, గణపతి పూజతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని, అనంతరం స్వామివారిని-అమ్మవారిని పెండ్లికుమారుని, పెండ్లికుమార్తెగా అలంకరిస్తామని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు అంకురారోహణ, మండప కలశ స్థాపన ఉంటాయన్నారు. 14న ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు, హోమం, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, అయ్యవారికి రుద్రాభిషేకం, అనంతరం స్వామివారి దివ్య కల్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు. రుద్రహోమం, పూర్ణాహుతి సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం, వసంతోత్సవం, చూర్ణోత్సవం, వేద స్వస్తి, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు ఉంటాయని తెలిపారు. 15న తెల్లవారుజామున స్వామివారికి అవబృతస్నానం, చక్రస్నానం అనంతరం అన్న సమారాధన జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

అన్నసమారాధన



మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయక స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

రసాయనాలతో తగ్గుతున్న భూసారం


అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ రామ్మోహన్‌రెడ్డి

కాజ(మొవ్వ): రైతులు అవలంబిస్తున్న రసాయన వ్యవసాయం వల్ల పెట్టుబడులు అధికమవడమే కాకుండా భూసారం తగ్గుతోందని మాస్టర్ ట్రైనర్ రామోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మొవ్వ మండలం కాజ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో తొలకరి ముందు నవధాన్యాల సాగు పద్ధతి పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరించాలని సూచించారు. 32 రకాల విత్తనాలతో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో విత్తుకోవటం వల్ల పంట మార్పిడి జరుగుతుందని తెలిపారు. తద్వారా ప్రధాన పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు భూమికి అంది దిగుబడి పెరుగుతుందన్నారు. అలాగే నవధాన్యాలు సాగు చేసి నేలలో కలియదున్నటం మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్‌బీకే కేంద్రాల్లో నవధాన్యాల కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

కార్యక్రమంలో సబ్ డివిజన్ యాంకర్ గొంగి పోతలయ్య, వీఏ హుస్సేన్, యూనిట్ ఇన్‌చార్జ్ విజయ భాస్కర్ రెడ్డి, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాల్లో అభివృద్ధి


కానుకొల్లులో ఫీల్డ్ ఛానల్ పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

మండవల్లి: ఉపాధి హామీ పనులతో గ్రామాలు అభివృద్ధి పథంలో కొనసాగుతున్నాయని ఇన్‌చార్జి ఏపీఓ ఎన్.నవీన్ తెలిపారు. మండలంలోని కానుకొల్లు గ్రామంలో రూ. 6 లక్షల 76 వేల 300 అంచనా విలువతో ఫీల్డ్ చానల్ పనులను బుధవారం 57 మంది ఉపాధి కూలీలు నిర్వహించినట్లు తెలిపారు. నవీన్ మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. తాగునీరు, సాగునీటి సమస్యలు తీరుతున్నాయని పేర్కొన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నారని తెలిపారు. పశువులకు చెరువులలోని నీరు దాహార్తి తీర్చడానికి ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

నాగాయలంక: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సమావేశంలో 21 శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందన్నారు. సంబంధిత మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు విధిగా హాజరు కావాలని కోరారు.

గృహ ప్రవేశాలకు ఆహ్వానం

గుడివాడ టౌన్: సొంతింటి కలను నెరవేరుస్తూ జననేత జగనన్న చేతుల మీదుగా జరుగుతున్న టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశాలకు రావాలని ఐదో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. వార్డులో బుధవారం ఇంటింటికి తిరుగుతూ మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానం పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9వ తేదీ పట్టణానికి విచ్చేస్తున్న సందర్భంగా ఉదయం 7 గంటలకు వార్డుకు చెందిన కట్టా సాంబయ్య ఇంటివద్ద అల్పాహారం ఏర్పాటు చేశామన్నారు. అక్కడ నుంచి బస్సులో సభాస్థలికి వెళతామని, అందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అర్జా ప్రసాదు, వెంపల అప్పారావు, పీవీ లక్ష్మణరావు, కె మహాలక్ష్మి, గంగాధరరావు, సీహెచ్ భాగ్యలక్ష్మి, మరడాని హరిత, కట్టా శాంతి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొజ్జగాని కోటమ్మ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

లక్ష్మీపురం(చల్లపల్లి): చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ పుచ్చగడ్డలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన బాధితులకు బుధవారం సాయంత్రం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ సహాయం అందచేశారు. అగ్ని ప్రమాద బాధితులు గొరిపర్తి వెంకటేశ్వరమ్మ, చెల్లుబోయిన వీర వెంకట సత్యనారాయణలకు బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర వెంకటేశ్వరరావు, అడుసుమిల్లి నాగమధు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, గొరిపర్తి సుబ్బారావు, నాగబాబు పాల్గొన్నారు.

బాబా ఆశీస్సులు అందరిపై ఉంటాయి


ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొడాలి నాని, మైనార్టీ నాయకులు

గుడివాడరూరల్: బాబా ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా జీవించాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో హజరత్ సయ్యద్ సాలార్ షా ఔలియా ఖాదరి ఉరుసు ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామ పొలిమేర్ల నుంచి చాందర్ గంధం శిరస్సుపై ఉంచుకుని ఖాదరిబాబా దర్గాకు చేరుకున్న ఎమ్మెల్యే బాబావారికి మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు దర్గా పెద్దలు బాబావారి ప్రసాదాన్ని అందించి మర్యాదపూర్వకంగా సత్కరించారు. ప్రసిద్ధి చెందిన ఔలియా ఖాదరి ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, బాబా వారి ఆశీస్సులు అందరిపై ఉంటాయన్నారు. పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వంతెన పనుల ప్రారంభం


పోల్‌రాజ్ పంట కాలువపై వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి పరిశీలిస్తున్న ఎంపీపీ అడవి కృష్ణ తదితరులు

కైకలూరు: శిథిలావస్థ వంతెనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరట లభించనుంది. మండల పరిషత్ నిధులు రూ.7 లక్షలతో నూతన వంతెన పనులను ఎంపీపీ అడవి కృష్ణ, ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారుడు దూలం శ్యామ్ బుధవారం ప్రారంభించారు. పూర్వం ముష్వా నాగేశ్వరరావు చికెన్ దుకాణం నుంచి పోల్‌రాజ్ పంట కాల్వపై నిర్మించిన కాలిబాట వంతెన శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిని తొలగించి కొత్త వంతెన ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇక్కడ వంతెన నిర్మాణం వల్ల అనేక కుటుంబాలకు ఉపయోగకరమన్నారు. నాలుగు చక్రాల వాహనాలు ప్రయాణించే అవకాశం ఉందన్నారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టరుకు సూచించారు.